క్లుప్తంగా

చొల్లేటి ప్రభాకర్‌కు సన్మానం



ప్రభాకర్ దంపతులను సన్మానిస్తున్న అభిమానులు

నల్లగొండ టౌన్ : రిటైర్డు ఐఏఎస్ అధికారి చొల్లేటి ప్రభాకర్ ఐఏఎస్‌కు ఎంపికై 40 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా సోమవారం స్థానికంగా ఆయన అభిమానులు ప్రభాకర్ దంపతులను శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ 40 సంవత్సరాల క్రితం తాను యూపీఎస్సీ పరీక్ష రాసి సివిల్స్‌కు ఎంపికయ్యానని తెలిపారు. గ్రామీణ ప్రాంత యువతీయువకులు యూపీఎస్సీ సివిల్స్ లక్ష్యంగా చదవాల్సిన అవసరం ఉందన్నారు. కఠోర శ్రమ, పుస్తక పఠనం, అనుకున్న లక్ష్యం మేరకు చదివితే ఐఏఎస్‌కు ఎంపిక కావడం అసాధ్యం కాదన్నారు. కార్యక్రమంలో జానయ్య, రమణారెడ్డి, శ్రవణ్‌కుమార్, చంద్రశేఖర్, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

దుకాణాలు, పెట్రోల్ బంకుల్లో తనిఖీ



తనిఖీలు చేస్తున్న అధికారులు

నల్లగొండ: పట్టణంలోని పలు దుకాణాలు, పెట్రోల్ బంక్‌లను సోమవారం లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ పి.రామకృష్ణ, ఇన్‌స్పెక్టర్ వి.శ్రీనివాస్ తనిఖీ చేశారు. తనిఖీల్లో భాగంగా ప్యాకేజింగ్ రూల్స్ ఉల్లంఘించిన ఐరన్ హార్డ్‌వేర్, సిమెంట్ వ్యాపారులపై 12 కేసులు నమోదు చేశారు. వ్యాపారస్తులు అమ్మే వస్తువులపై మ్యానుఫ్యాక్చరింగ్ అడ్రస్, రిటైల్ ధర, నెట్ క్వాంటిటీ, మ్యానుఫ్యాక్చరింగ్ తేదీ, బెస్ట్ బిఫోర్ వంటి వివరాలు పొందుపర్చకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పెట్రోల్ బంక్‌ల నిర్వాహకులు వినియోగదారులకు అక్కడికక్కడే 5 లీటర్ల క్యాన్‌తో డెలివరీలు చెక్ చేసి చూపించాల్సిందిగా ఆదేశించారు. అనంతరం వినియోగదారులకు అవగాహన కల్పించారు.

ధర్మ సమాజ్ పార్టీ అభ్యర్థిని గెలిపించాలని ప్రచారం

చండూరు : ధర్మ సమాజ్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి బరిగెల దుర్గాప్రసాద్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరుతూ ఆ పార్టీ నాయకులు చండూరులో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు నేరళ్ళ లింగయన్, మండల కో కన్వీనర్ శ్రీశైలం మహారాజ్, సుమన్ మహారాజ్, మహేష్, శంకర్, అనిల్, లింగస్వామి, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్లు పెంచకుండా ఎన్నికలు నిర్వహించొద్దు



మాట్లాడుతున్న దీపేందర్

నల్లగొండ టౌన్ : బీసీ రిజర్వేషన్లు పెంచకుండా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించొద్దని బీసీ యువజన సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కట్టెకోలు దీపేందర్ అన్నారు. జిల్లా కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమగ్ర కులగణన చేపట్టి బీసీ రిజర్వేషన్లు పెంచిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కులగణన చేయకుండా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తే బీసీలు రాజకీయంగా తీవ్రంగా నష్టపోతారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ యలిజాల వెంకటేశ్వర్లు, నియోజకవర్గ అధ్యక్షుడు బోళ్ల నాగరాజు, చంద్రశేఖర్, అనిల్ చెర్రీ పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ



సరుకులు అందజేస్తున్న రమేష్

నల్లగొండ టౌన్ : సొసైటీ ఆఫ్ లెప్రసీ ఎఫెక్ట్ ఎడ్ పర్సన్స్ రాష్ట్ర అధ్యక్షుడు రమేష్ ఆధ్వర్యంలో సోమవారం నల్లగొండ పట్టణంలోని లెప్రసీ కాలనీలో 150 మందికి బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో పీర్ల జానయ్య, నాగరాజు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం.. కేసు నమోదు

చౌటుప్పల్: పట్టణ కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి అదృశ్యమైనట్లు సోమవారం ఫిర్యాదు అందిందని సీఐ అశోక్‌రెడ్డి తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. చౌటుప్పల్ పట్టణంలోని హనుమాన్‌నగర్ కాలనీలో నివాసముంటున్న జెనిగెల మల్లేష్(35) లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లిన అతడు తిరిగి ఇంటికి చేరుకోలేదు. కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అనుమతుల్లేకుండా మట్టి తరలింపు



కొంపల్లి చెరువులో మట్టి తవ్వడంతో ఏర్పడిన గుంతలు

- చెరువులు, కుంటల్లో తవ్వకాలు
- ఇటుక బట్టీలకు తరలించి సొమ్ము చేసుకుంటున్న అక్రమార్కులు
- ఆనవాళ్లు కోల్పోతున్న చిన్న నీటి వనరులు
- తెలిసినా పట్టించుకోని అధికారులు

మునుగోడు: మండలంలోని పలు గ్రామాల్లో చిన్న నీటి వనరులు ఆనవాళ్లు కోల్పోతున్నాయి. అనుమతులు లేకుండా కొందరు చెరువుల్లోని మట్టిని జేసీబీలతో తవ్వించి టిప్పర్లు, ట్రాక్టర్లలో ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. దీంతో ఆ చెరువులో పెద్ద గుంతలు ఏర్పడి బావులను తలపిస్తున్నాయి. అయినా సంబంధిత అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు.

122 చెరువులు, కుంటలు

మునుగోడు మండలంలోని 26 గ్రామాల్లో మొత్తం 112 చెరువులు, కుంటలు ఉన్నాయి. అందులో పెద్ద చెరువులు 11 ఉన్నాయి. పెద్ద చెరువులతో పాటు చిన్న కుంటల్లోని మట్టిని కొందరు రైతులు తమ వ్యవసాయ భూముల్లో పోయించుకుంటుండగా మరి కొందరు ఇటుక బట్టీల వ్యాపారులకు అమ్ముకుంటున్నారు. ఇంకొందరు చెరువుల్లోని మొరం మట్టిని ఫంక్షన్ హాల్స్ నిర్మాణానికి, రోడ్లు, పాట్ల ఏర్పాటు ఇతర అవసరాలకు వినియోగిస్తున్నారు. ప్రధానంగా మండలంలోని చొల్లేడు మైసమ్మ చెరువు, కొంపల్లి పెద్ద చెరువు, ఊకొండి, మునుగోడు పెద్ద చెరువులతో పాటు జక్కలవారిగూడెం నడిమి కుంట, ఎల్లగూడెం ఎర్రకుంట తదితర చెరువుల్లో మట్టిని రవాణా చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

నీటి నిల్వ కష్టమే...

మట్టి రవాణా చేస్తున్న కుంటలు, చెరువుల్లో నీటి నిల్వ కష్టమేనని పలువురు వాపోతున్నారు. తప్పనిసరి పరిస్థితిలో చెరువుల్లో మట్టిని అధికారుల సూచన ప్రకారం కేవలం రెండు అడుగుల లోతు వరకు మాత్రమే ఎత్తాలి. కానీ కొందరు అక్రమార్కులు 10 నుంచి 20 అడుగుల లోతు వరకు తవ్వి మట్టిని తరలిస్తున్నారని తెలిసింది. అలా పెద్ద పెద్ద గుంతలు పెట్టడంతో వర్షం నీరు వచ్చినా వెంటనే భూమిలోకి ఇంకి పోయి చెరువులో నీరు నిల్వ ఉండదని పలువురు చెబుతున్నారు. దీంతో ఆయా చెరువుల్లో చేపలు పట్టుకుని జీవనం సాగించే మత్స్యకారులు ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉంది. సంబంధిత అధికారులు మట్టి రవాణాను అడ్డుకోవాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.

అధికారులు పట్టించుకోవడం లేదు



గ్రామంలోని పెద్ద చెరువు మట్టిని నెల రోజులుగా అనుమతి లేకుండా తరలిస్తున్నారు. విషయాన్ని అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదు. చెరువులో దాదాపు 20 అడుగుల లోతు వరకు మట్టిని తవ్వి తరలిస్తున్నారు. దీంతో వర్షాలు వచ్చినప్పుడు నీరు వచ్చి చేరినా నిల్వ ఉండే అవకాశం ఉండదు. – సూరశంకర్, కొంపల్లి

కేసులు నమోదు చేయిస్తాం..

అనుమతి లేకుండా చెరువులు, కుంటల్లో మట్టిని తరలించేవారిపై చర్యలు తీసుకుంటాం. కొందరు రైతులు వ్యవసాయ భూముల్లో నల్ల మట్టి పోసుకుంటాం అంటే సరేనని చెప్పాం. మొరం మట్టిని తరలిస్తున్న విషయం మా దృష్టికి రాలేదు. త్వరలో చెరువులను పరిశీలించి మట్టిని తరలిస్తున్న వారిపై పోలీసు కేసులు నమోదు చేయిస్తాం. – ప్రేమ్‌కుమార్, ఇరిగేషన్ శాఖ డీఈ

మళ్లీ బీఆర్‌ఎస్ పార్టీదే రాజ్యం



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి

- మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి

నకిరేకల్ : రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని ఎందుకు దూరం పెట్టామా అని ప్రజలు ఇప్పుడు పునరాలోచన చేస్తున్నారని, రాబోయే రోజుల్లో మళ్లీ బీఆర్‌ఎస్ రాజ్యం రాబోతుందని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. నల్లగొండ-ఖమ్మం-వరంగల్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ బీఆర్‌ఎస్ అభ్యర్థి రాకేష్‌రెడ్డి గెలుపుకోసం నకిరేకల్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటుచేసిన నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రధాని మోదీ నిర్ణయాలతో దేశంలోని పలు రాష్ట్రాల్లో ప్రజలు ఇంకా ఒక్కపూట భోజనంతోనే సరిపెట్టుకుంటున్నారని అన్నారు. తెలంగాణలో కేసీఆర్ సంక్షేమ పథకాలను తీసుకురావడంతో ప్రజలు మూడు పూటలా అన్నం తింటున్నారని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పదేపదే దేవుళ్ల మీద ఒట్టేసి రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తానని అంటున్నాడని, ఇదీ ఆయన చేయలేడన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తయ్యే వరకు ప్రజలను, రైతులను మోసం చేయడం కోసమే రుణమాఫీకి ఆగస్టు 15 తేదీ గడువు పెట్టారని విమర్శించారు. నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, ఎన్నికల ఇన్‌చార్జ్ రాంబాబు, డాక్టర్ చెరుకు సుధాకర్, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్, జెడ్పీటీసీలు మాద ధనలక్ష్మీనగేష్, తలారి బలరాం, మాజీ మార్కెట్ చైర్మన్ కొప్పుల ప్రదీప్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల, పట్టణ అధ్యక్షులు ప్రగడపు నవీన్‌రావు, యల్లపురెడ్డి సైదిరెడ్డి, మారం వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

తీన్మార్ మల్లన్న గెలుపునకు కృషి చేయాలి

నల్లగొండ : వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న గెలుపు కోసం ప్రతి కాంగ్రెస్ కార్యకర్త కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి కోరారు. సోమవారం నల్లగొండ పట్టణంలోని మంత్రి కోమటిరెడ్డి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన నల్లగొండ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటున్న ప్రతి గ్రాడ్యుయేట్ వద్దకు కాంగ్రెస్ కార్యకర్తలు వెళ్లి కాంగ్రెస్‌కు ఓటు వేసేవిధంగా చూడాలన్నారు. మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ నల్లగొండ పట్టణంతోపాటు నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. గ్రాడ్యుయేట్ ఓటర్లంతా ప్రశ్నించే గొంతుక తీన్మార్ మల్లన్నను గెలిపించాలని కోరారు. ఎమ్మెల్సీ ఎన్నికల తర్వాత స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతాయని, పార్టీ కోసం పనిచేసిన నాయకులకే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రాధాన్యత ఇస్తారని తెలిపారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, జెడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య, మనిమద్దె సుమన్, చిట్ల వెంకటేశం, జూకూరి రమేష్, ఆలకుంట్ల నాగరత్నం రాజు, ఏఏ ఖాన్, జూలకంటి వెంకట్‌రెడ్డి, ప్రవీణ్, దుబ్బ రూపా అశోక్‌సుందర్, సురెడ్డి సరస్వతి, నాగమణిరెడ్డి, లలిత పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి

పేద కుటుంబానికి చేయూత



సరుకులు అందిస్తున్న కోడి శ్రీనివాసులు

చండూరు : మున్సిపాలిటీ పరిధిలోని 6వ వార్డులో నిరుపేద మహిళ రాపోలు సాంబమ్మ (55)మృతి చెందింది. విషయం తెలుసుకున్న గాంధీజీ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు సోమవారం బాధిత కుటుంబాన్ని ఆదుకునేందుకు బియ్యం, కిరాణ సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో పున్న భిక్షమయ్య, రావిరాల రాజేంద్రప్రసాద్, తిరందాసు నందు, ఏలె సుధాకర్, సరికొండ వెంకన్న, రుద్ర యాదగిరి, గుర్రం అంజయ్య, జూలూరు వెంకటేశ్వర్లు, సంగిశెట్టి సాయి, బోడ విజయకుమార్ పాల్గొన్నారు.

చేనేత సమస్యలు పరిష్కరించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న చేనేత కార్మిక సంఘం నాయకులు

చండూరు: చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చేనేత పరిరక్షణ సేవా సమితి అధ్యక్షుడు రాపోలు ప్రభాకర్, కార్యవర్గ సభ్యులు, పద్మశాలి కుల పెద్దలు సోమవారం చండూరు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ చేనేత త్రిఫ్ట్ ఫండ్, చేనేత మిత్రతో పాటు ఇతర అన్ని పథకాలను కొనసాగించాలని కోరారు. త్రిఫ్ట్ ఫండ్‌కు సంబంధించి కాలపరిమితి మేరకు ప్రీమియం మొత్తాన్ని ప్రభుత్వమే చెల్లించి తక్షణమే డబ్బులు విడుదల చేయాలని కోరారు. పని భరోసా కల్పించేందుకు ప్రింటెడ్ చీరలను అరికట్టడంతోపాటు చేనేత సంఘాలను బలోపేతం చేసి చేనేత చీరలను కొనుగోలు చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. 60 ఏళ్లు దాటినవారికి కార్పొరేషన్ ద్వారా రూ.5 లక్షల జీవిత బీమా వచ్చేలా చూడాలన్నారు. బ్యాంకు రుణాలు మాఫీ చేయాలని, క్యాష్‌లెస్ హెల్త్ కార్డులు ఇవ్వాలని, పిల్లల ఉన్నత చదువులకు ఆర్థికసాయం అందించాలన్నారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం పట్టణ అధ్యక్షుడు గుర్రం భిక్షమయ్య, గౌరవ అధ్యక్షుడు పులిపాటి ప్రసన్న, ట్రస్ట్ చైర్మన్ కోమటి వీరేశం, శ్రీను, కర్నాటి శ్రీనివాసులు, వెంకటేశం, కృష్ణ, రాపోలు జగదీశ్వర్, సన్నీ, రాఘవేంద్ర, రాజు, కర్నాటి నగేష్, రాపోలు ప్రభాకర్, సుమన్, ముషం రాములు, ముషం యాదగిరి, జానకిరాములు, మార్కండేయ, భిక్షమయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రేమేందర్‌రెడ్డిని గెలిపించాలని ప్రచారం



నల్లగొండ టూటౌన్ : కలెక్టరేట్‌లో ఉద్యోగులకు కరపత్రాలు అందజేస్తున్న బీజేపీ నాయకులు

నల్లగొండ టూటౌన్ : వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డిని గెలిపించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డి, కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు గోలి మధుసూదన్‌రెడ్డి కోరారు. సోమవారం నల్లగొండ పట్టణంలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లి బీజేపీ అభ్యర్థికి ఓట్లు వేయాలని ఉద్యోగులను అభ్యర్థించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఉద్యోగులు, నిరుద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించే గొంతుక ప్రేమేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వీరెల్లి చంద్రశేఖర్, కన్మంతరెడ్డి శ్రీదేవిరెడ్డి, పోతెపాక లింగస్వామి, గుండా నవీన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

46 జీవో రద్దు బీజేపీ గెలుపుతోనే సాధ్యం

పట్టభద్రులు ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి గెలుపుతోనే జీఓ నెంబర్ 46 రద్దు సాధ్యమని బీజేపీ జిల్లా కార్యదర్శి కంచర్ల విద్యాసాగర్ రెడ్డి అన్నారు. సోమవారం నల్లగొండ పట్టణంలోని 41, 42వ వార్డుల్లో వైద్యులు, పట్టభద్రులను కలిసి బీజేపీకి ఓటు వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో హైమావతి, రాంబాబు, వంశీ నాగమణి, గాయత్రి పాల్గొన్నారు.

చండూరులో..

చండూరు: ఖమ్మం-వరంగల్-నల్లగొండ ఎమ్మెల్సీ బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరుతూ సోమవారం చండూరు పట్టణంలో బీజేపీ నాయకులు ప్రచారం నిర్వహించారు. ప్రేమేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. జిల్లా ఉపాధ్యక్షుడు సోమా నర్సింహ, ఓబీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి కోమటి వీరేశం, పట్టణ అధ్యక్షుడు పందుల సత్యం గౌడ్, సింగల్ విండో డైరెక్టర్ బోడ ఆంజనేయులు, బూతరాజు శ్రీహరి, స్వామి, శంకర్, శ్రీధర్, రావిరాల శ్రీను, బొబ్బల శివ, గండు శ్రీకాంత్, గన్నవరం నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు ఇవ్వకపోతే కలెక్టరేట్ ముట్టడిస్తాం

నల్లగొండ టౌన్ : గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న సిబ్బందికి పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే ఇవ్వకపోతే కలెక్టరేట్ ముట్టడిస్తామని తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిన్నపాక లక్ష్మీనారాయణ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సోమవారం దొడ్డి కొమరయ్య భవన్‌లో జరిగిన గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ వర్కర్స్ యూనియన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని 844 గ్రామ పంచాయతీల్లో సుమారు 3400 మంది పారిశుద్ధ్య సిబ్బంది మంచినీటి సరఫరా, వీధి లైట్ల నిర్వహణ, పన్నుల వసూళ్ల వంటి పనుల్లో సేవలందిస్తున్నారన్నారు. పది నెలల నుంచి వేతనాలు లేక అర్ధాకలితో జీవితాలు వెళ్లదీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి వేతనాలు చెల్లించాలన్నారు. అర్హత కలిగిన కార్మికులను రెగ్యులర్ చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు పోలే సాంబయ్య, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు నాంపల్లి చంద్రమౌళి, పొన్న అంజయ్య, ఎండీ. జహీర్, జి.ఆశీర్వాదం, కోనయ్య, సర్వయ్య, ఎర్ర అరుణ, కత్తుల రామలింగయ్య, నాంపల్లి రమేష్, పెద్దమ్మ, సుధాకర్, లక్ష్మయ్య, రమేష్, లింగస్వామి, బాలమ్మ పాల్గొన్నారు.

25న శిక్షణ శిబిరం

మర్రిగూడ : గ్రామ భారతి ఆధ్వర్యంలో ప్రకృతి గో. ఆధారిత ఉత్పత్తులపై సేంద్రియ వ్యవసాయ శిక్షణ శిబిరాన్ని నిర్వహించనున్నట్లు మర్రిగూడ గ్రామ భారతి అధ్యక్షురాలు ఎం.సూర్యకళ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. యాదాద్రి జిల్లాలోని బొమ్మలరామారం మండలం పెద్దపర్వతపురం శ్రీసాయిధామం వద్ద ఈ నెల 25న ఈ శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ శిబిరంలో రైతులకు సేంద్రియ వ్యవసాయంపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు. ఈ శిక్షణను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిక్షణ శిబిరంలో పాల్గొనడానికి ఆసక్తి కలిగిన రైతులు 9490850766, 9121998091 నంబర్లను సంప్రదించాలని కోరారు.

ఉపాధి కూలీలకు దినసరి వేతనం పెంచాలి



కూలీల సమస్యలు తెలుసుకుంటున్న లూర్దు మారయ్య

కేతేపల్లి: పెరుగుతున్న నిత్యావసర ధరలకు అనుగుణంగా ఉపాధిహామీ పథకంలో పని చేస్తున్న కూలీలకు రూ.600 దినసరి వేతనం చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి చింతపల్లి లూర్దుమారయ్య డిమాండ్ చేశారు. సోమవారం కేతేపల్లి గ్రామంలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను ఆయన పరిశీలించి కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా కూలీలనుద్దేశించి మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన గత పదేళ్ల నుంచి ఏటేటా బడ్జెట్‌లో నిధుల కేటాయింపు కుదిస్తూ ఉపాధిహామీ పథకాన్ని రద్దు చేసే కుట్ర చేస్తోందని విమర్శించారు. ఉపాధి పనులు చేసిన కూలీలకు సకాలంలో డబ్బులు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సంఘం మండల కార్యదర్శి చౌగోని నాగయ్య, మండల కార్యదర్శి చింతపల్లి లూర్దుమారయ్య, సొడయ్య, జటంగి వెంకన్న, లింగయ్య, సొనమ్మ, బాలయ్య, మల్లయ్య పాల్గొన్నారు.

భజన మందిర ప్రహరీ కూల్చివేత



కూల్చిన ప్రహరీని పరిశీలిస్తున్న గ్రామస్తులు

చిట్యాల: మండలంలోని గుండ్రాంపల్లి గ్రామంలో శ్రీ శివరామ దీక్షిత అచలగురు పీఠ సంప్రదాయ రాజయోగి ఆగోలు సంగయార్యుల శిష్య బృందం వారి భజన మందిరం ప్రహరీని ఆదివారం రాత్రి కొందరు లారీతో ఢీకొట్టి కూల్చివేశారు. వివరాలు.. గ్రామానికి చెందిన రావుల బీరప్ప ఇరవై నాలుగేళ్ల క్రితం తనుకున్న కొంత స్థలాన్ని భజన బృందం మందిర నిర్వహణకు విరాళంగా అందజేశారు. అప్పటినుంచి గ్రామస్తులు ఆ మందిరంలో భజన కార్యక్రమాలు నిర్వహించుకుంటున్నారు. అయితే బీరప్ప కుటుంబ సభ్యుడు ఏడాది నుంచి తమ స్థలాన్ని తమకు ఇవ్వాల్సిందిగా డిమాండ్ చేస్తూ వస్తున్నారు. కాగా ఆదివారం రాత్రి భజన మందిరం ప్రహరీని కూల్చివేయడంతో.. స్థలాన్ని విరాళంగా అందజేసిన కుటుంబ సభ్యుడు కూల్చివేశారని ఆరోపిస్తూ సోమవారం ఆ గ్రామస్తులు, భజన మందిరం వద్ద ఆందోళన చేశారు. అనంతరం చిట్యాల పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ స్థలం వివాదంపై కోర్టులో కేసు నడుస్తున్నట్లు తెలిసింది.

కల్వర్టుకు మరమ్మతులు చేపట్టరూ..

మర్రిగూడ : మండలంలోని రాంరెడ్డిపల్లి పరిధి చర్లగూడెం నుంచి వెంకేపల్లి గ్రామాల మధ్య కల్వర్టు రెండేళ్ల క్రితం ధ్వంసమైంది. ఇరు గ్రామాల ప్రజలకు ప్రయాణానికి ఆటంకం కలగడంతో తాత్కాలిక పనులు చేపట్టి గూనలు ఏర్పాటు చేసి మట్టి పోశారు. పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టకపోవడంతో ప్రయాణికులు వర్షాకాలంలో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుందని ఆయా గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు. రెండు గ్రామాలు కూడా ముంపు గ్రామాలనేనని అధికారులు నిర్లక్ష్యం వహించడం సరికాదంటున్నారు.



చర్లగూడ-వెంకేపల్లి గ్రామాల మధ్య దెబ్బతిన్న కల్వర్టు

మన కూరగాయలు మనమే సాగుచేద్దాం

- మేడపైన, ఇంటి పక్కన ఖాళీ స్థలంలో కూరగాయల సాగు
- సేంద్రియ ఎరువుల వినియోగం
- సామూహిక సాగుతో ఆదర్శంగా నిలుస్తున్న ఉపాధ్యాయ దంపతులు



మేడపైన సాగు చేస్తున్న కూరగాయల తోట



మొక్క నాటుతున్న విద్యాసాగర్‌రెడ్డి

నకిరేకల్ : ఆ దంపతులు ఇద్దరూ ప్రభుత్వ ఉపాధ్యాయులే.. వారు ఓ వైపు ఉద్యోగం చేస్తూనే కూరగాయల సాగుపై మక్కువ చూపుతున్నారు. వారు పండించిన కూరగాయలను వారు వినియోగించుకోవడమే కాక చుట్టుపక్కల వారికి కూడా అందిస్తున్నారు. మిద్దెపైన కిచెన్ గార్డెన్ ఏర్పాటుతోపాటు ఇంటి పక్కన ఖాళీ స్థలంలో చుట్టుపక్కల ఐదారు కుటుంబాలు కలిసి ప్రత్యేక గార్డెన్ ఏర్పాటు చేసుకుని అందులోనే అవసరమైన కూరగాయలను పండించుకుంటున్నారు.

శాశ్వత కుండీలు ఏర్పాటు..

నకిరేకల్ మున్సిపాలిటీ కేంద్రంలోని డాక్టర్స్ కాలనీలో నివాసం ఉంటున్న కనుకుంట్ల విద్యాసాగర్‌రెడ్డి-కోకిల దంపతులు ఇద్దరూ ప్రభుత్వ ఉపాధ్యాయులే. విద్యాసాగర్‌రెడ్డి నెల్లిబండలో ప్రాథమిక పాఠశాలలో ఆయన సతీమణి కోకిల మండలాపురం ప్రాథమికోన్నత పాఠశాలలో పనిచేస్తున్నారు. వీరు నకిరేకల్‌లోని డాక్టర్స్ కాలనీలో నివసిస్తున్నారు. తమ సొంత ఇంటి మిద్దెపైన కూరగాయలు పండించడానికి శాశ్వత కుండీలు ఏర్పాటు చేసుకున్నారు. మిద్దె మీద భారం పడకుండా అడ్డ ఫిల్లర్లపై సిమెంటు తొట్లను కట్టించారు. మట్టి మిశ్రమంలో కోక్ పీట్ కలపడం, రూఫ్ పాడవకుండా పీవీ పెయింట్ వేసి తగు జాగ్రత్తలు తీసుకున్నారు. మిద్దెపై కిచెన్ గార్డెన్‌తోపాటు ఇంటి పక్కన ఉన్న 5 గుంటల స్థలంలో చుట్టుపక్కల ఉన్న ఐదారు కుటుంబాలు సామూహికంగా వివిధ రకాల కూరగాయలను పండించుకుంటున్నారు.

వివిధ రకాల కూరగాయలు..



ఇంటి పక్కన ఖాళీ స్థలంలో సామూహికంగా సాగు చేస్తున్న కూరగాయల తోట

మిద్దెపైన, మిద్దె కింద ఖాళీ స్థలంలో కూరగాయలు, ఆకుకూరలు, తీగ జాతి కూరగాయలను పండిస్తున్నారు. వంకాయ, టమాట, గోకరకాయ, బెండ, మిరపతోపాటు పాలకూర, బచ్చలకూర, తెల్లగలీజేరు, పొన్నగంటి, చుక్కకూర సాగుచేస్తున్నారు. తీగ జాతి మొక్కలైన బీర, దొండ, కాకర వంటి కూరగాయలను పండించుకుంటున్నారు. కూరగాయలకు సంబంధించి దేశీయ విత్తనాలనే వాడుతున్నారు. పంట ద్వారా వచ్చిన విత్తనాలను సేకరించి మరుసటి పంటకు వినియోగిస్తున్నారు. ఇక ఎరువుల విషయానికి వస్తే సేంద్రియ ఎరువులైన పశువుల పేడ, వర్మీ కంపోస్ట్, వేప పిండిలను వాడుతున్నారు. ఆ దంపతులు మొక్కలను ప్రతిరోజూ గమనిస్తూ చీడపీడలు ఉన్న ఆకులను చేతితో ఏరివేయడం చేస్తున్నారు. చీడ పీడలు ఎక్కువయితే రసాయన పురుగు మందులు వాడకుండా ఇంట్లోనే తయారు చేసిన పుల్లటి మజ్జిగ, పచ్చి మిర్చి, వెల్లుల్లితో చేసిన ద్రావణం, వేప నూనె కలిపిన ద్రావణం, ఇంగువ కలిపిన ద్రావణం మొక్కలపై పిచికారీ చేస్తూ ఆరోగ్యకరమైన కూరగాయలు, ఆకు కూరలను పండించుకుంటున్నారు.

సరిపడా కూరగాయలు అందుతున్నాయి

మార్కెట్‌లో వివిధ రసాయనాలు వాడి పండించిన కూరగాయలను చూసినప్పు డు సేంద్రియ పద్ధతిలో మన ఇంట్లోనే కూరగాయలు పండించుకోవాలని మాకు అనిపించింది. ఇంటిపైనా, ఇంటి పక్కన ఖాళీ స్థలంలో కిచెన్ గార్డెన్‌లను ఏర్పాటు చేసుకున్నాం. ప్లాస్టిక్ కుండీలు ఎక్కువ కాలం మన్నిక ఇవ్వవు అనే ఉద్దేశంతో శాశ్వత సిమెంటు కుండీలను ఏర్పాటు చేశాం. ఈ కిచెన్ గార్డెన్ వల్ల మా కుటుంబానికి వారానికి సరిపడా కూరగాయలు అందుతాయి. ఎక్కువైనప్పుడు చుట్టుపక్కల వారికి ఇస్తున్నాం. మా పిల్ల లను కూడా భాగస్వాములను చేశాం.

– కనుకుంట్ల విద్యాసాగర్‌రెడ్డి, ప్రభుత్వ ఉపాధ్యాయుడు, నకిరేకల్